క్లుప్తంగా

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



భీమవరం డీఈవో కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్, డైరీలను జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ గురువారం ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో అగ్రభాగాన్ని నిలబెట్టడం కోసం ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు వేమూరి శ్రీవల్లి, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దాడ రాజేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యురాండ్రు దాసరి తిరుమలేశ్వరి, ఆవాల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: దాళ్వా వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది దాళ్వా సాగుకు సుమారు 8 వేల ఎకరాలకు రైతులు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటివరకు 500 పైగా వరినాట్లు పూర్తయ్యాయన్నారు. వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని లేకుంటే మార్చి, ఏప్రియల్ నెలల్లో పంట కోతకు వచ్చే దశలో కాలువలు కట్టేయడంతో నీటి ఎద్దడి వచ్చి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రైతులు త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలని రైతులను కోరారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ఆకివీడు: మండలంలో కొత్తగా రేషన్ షాపులు ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. మండలంలోని షాపు- 10 రాజులపేట (బీసీ-డీ ఉమెన్), 22 ఆకివీడు-ఎస్సీ (ఉమెన్), 26 ఆకివీడు (ఓసీ), నంబర్-32 చినమిల్లిపాడు (ఓసీ ఈడబ్ల్యూఎస్)లకు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. ఇంటర్ పూర్తి, చదువుతున్న, ఫెయిల్ అయినవారైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 18-40 మధ్య వయస్కులైనవారు అర్హులన్నారు.

రేషన్ డీలర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

పాలకోడేరు: మండలంలోని రెండు రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని భీమవరం ఆర్డీఓ ప్రకటించారు.ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పాలకోడేరులోని 6 వ నంబర్ షాపునకు బీసీ (డి), శృంగవృక్షం 10వ నంబర్ షాపు (జనరల్) రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు.గతంలో ఈ రెండు షాపుల డీలర్లు వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేశారని తెలిపారు. ఈ నెల 12లోగా దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్‌కు, భీమవరం ఆర్డీఓకు అందజేయాలని కోరారు. అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణత, స్థానికులు అర్హులని తెలిపారు.

దూసనపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి మృతి

వీరవాసరం: మండలంలోని దూసనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న విజయ్ కుమార్ గురువారం భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విజయ్ కుమార్ మృతదేహాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, దోసూనపూడి మాజీ సర్పంచ్ దాడి కాశీ వెంకట నరసింహం త్రిమూర్తులు శ్రీనివాసరావు, నేలపాడు ప్రసాద్ బాబు, కందుబోయిన నాగమల్లేశ్వరరావులు పరామర్శించి సంతాపం ప్రకటించారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

నరసాపురం: స్థానిక మునసబుగారి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందులు సరిపడగా ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, పరసరాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ పలితాలు విడుదల చేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ డిసెంబర్ 3వ వారంలో ఈ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మొదటి సెమిస్టర్‌లో 219 మంది విద్యార్థుల్లో 166 మంది 75.80 శాతంతో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అందని ద్రాక్షగా ఇంగ్లీష్ మీడియం చదువులు

- ఆంగ్ల మాధ్యమ విద్యా బోధనపై సర్కారు వెనుకడుగు
- వైఎస్సార్ సీపీ పాలనలో ప్రత్యేక శిక్షణతో బోధన అద్భుతం



ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న టీచర్



నాడు-నేడులో అభివృద్ధి చెందిన ఆకివీడు జెడ్పీస్కూల్

ఆకివీడు: ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల విద్యా బోధన కరువవ్వడం వల్లే కొన్నేళ్లుగా సర్కారు బడులు బలహీనపడ్డాయని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. కూలి పని చేసుకుని జీవించే వ్యక్తి కూడా తన బిడ్డ ఆంగ్ల విద్యనభ్యసించి, ఇంగ్లీషులో మాట్లాడటం ద్వారా తను చెమటోడ్చిన కష్టాన్ని మరిచిపోతుంటాడని, ఆ పరిస్థితిని ప్రభుత్వాలు తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనను అమలు చేయడంతో పిల్లలు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా తమ పిల్లల్ని పాఠశాలలకు పంపేవారు. అయితే ఆ పరిస్థితి నుంచి నేటి ప్రభుత్వం తెలుగు బోధనకే మొగ్గు చూపడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీషు మీడియంలో విద్యా బోధనకు గతంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. నియోజకవర్గంలోని 35 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో వేలాది మంది విద్యార్థులు విద్యా బోధనను అభ్యసిస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు విద్యకు గత ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. నిరుపేదల పిల్లలు చదువుకు దూరం కాకూడదని గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం అమలుజేసి రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని అందించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 20 వేలు కుటుంబంలో ఎంతమంది ఉన్నా ఇస్తానన్న వాగ్దానం ఇచ్చి గద్దెనెక్కాక ఆ పథకం ఊసే ఎత్తడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో విద్యార్థులకు ఆధునిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ఉచిత ట్యాబ్‌లు ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ సదుపాయాన్ని కూడా ఎత్తేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీబీఎస్ఈ రద్దు దిశగా అడుగులు

ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యా విధానాన్ని గత ప్రభుత్వం అమలుజేసింది. రాష్ట్ర, కేంద్ర పరిధిలోని పాఠశాలల్లో అమలుజేసే సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. ఆంగ్లంలో పాఠ్యాంశాలుంటాయి. ప్రస్తుత ప్రభుత్వం సీబీఎస్ఈ బోధనను నియోజకవర్గంలోని 8 పాఠశాలల్లో రద్దు చేశారు. పాఠ్యాంశాలలో రాష్ట్ర, కేంద్ర విధానంలో మార్పులు లేన్నప్పటికీ పరీక్షా విధానంలో మాత్రమే సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లో మార్పు ఉంటుంది.

నియోజకవర్గంలో జెడ్పీ పాఠశాలలు, సీబీఎస్ఈ స్కూల్స్

ఆకివీడు	9	2
ఉండి	8	2
కాళ్ల	9	2
పాలకోడేరు	9	2

విద్యా పథకాల రద్దు తగదు



కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా పథకాల్ని అమలుజేయాలి. అమ్మ ఒడి పథకం ద్వారా ఎంతో మంది నిరుపేదల పిల్లలు బడిబాట పట్టారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యాకానుక, విద్యాదీవెన, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కొనసాగించాలి. పథకాల కొనసాగింపు పేద ప్రజల పిల్లలకు అవసరం.

– పీవీఎల్.నర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్

అంతర్జాతీయ ప్రమాణాలందుతాయి



ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఎక్కడికైనా వెళ్లి ఉద్యోగం సంపాదించుకునే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సంపాదించవచ్చు. బోధనలో తెలుగు, ఇంగ్లీష్ ఉండాలి. దీనివల్ల సామర్థ్యం లేని విద్యార్థులు తెలుగులో చదువుకునే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులకు ఆయా సబ్జెక్టుల్లో మెరుగైన బోధనకు శిక్షణ ఇవ్వాలి.

–పెదపూడి నాగేశ్వరరావు, అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, ఆకివీడు మండల శాఖ

ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 3వ తేది నుంచి వారం రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ సభ్యుడు గంగిపాముల భాస్కర్ చెప్పారు. దివంగత గంగిపాముల రంగనాయకులు జ్ఞాపకార్థం అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్, శంకర్ నేత్రాలయ సహకారంతో నిర్వహించే ఈశిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి శుక్ల ఆపరేషన్లు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేస్తారని భాస్కర్ తెలిపారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని ఇతర వివరాల కోసం సెల్: 70951 75251, 99898 8420 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. రాయలం, బలుసుమూడి, డీఎన్నార్ కళాశాల రోడ్, బీసీ కాలనీ, లెక్చరర్ వీధి, రామలక్ష్మి నగర్, గొల్లవానితిప్ప రోడ్, ప్రకాష్ నగర్, గొర్లమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతో పాటు రాయలం, అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రీయల్ లైన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరంలో...

భీమవరం: రాయలం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, కొత్తబ్రేకర్ ఏర్పాటు కారణంగా నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాయలం, బలుసుమూడి, డీఎన్నార్ కళాశాల రోడ్, బిసి కాలనీ, లెక్చరర్ వీధి, రామలక్ష్మీనగర్, గొల్లవానితిప్ప రోడ్డు, ప్రకాష్ నగర్, గొరగనమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతో పాటు రాయలం, అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రియల్ లైన్స్, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

మట్టిలో మాణిక్యాల్ని వెలికితీస్తున్న డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న సంక్రాంతి ఆటల పోటీల ఆహ్వాన సంఘ గౌరవధ్యక్షుడు ప్రతాప్‌కుమార్

ఆకివీడు: మట్టిలో మాణిక్యాల్ని వెలికితీస్తున్న డీవైఎఫ్ఐ కృషి ప్రశంసనీయమని సంక్రాంతి యువజనోత్సవాల ఆహ్వాన కమిటీ గౌరధ్యక్షుడు డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ చెప్పారు. ఆయన కార్యాలయంలో గురువారం డీవైఎఫ్ఐ 42వ సంక్రాంతి యువజనోత్సవాల పోటీల వివరాల్ని విలేకర్లకు వివరించారు. కమిటీ కన్వీనర్ డొకల రవి తేజ, ఆహ్వాన సంఘ కార్యదర్శి గేదల ధనుష్ మాట్లాడుతూ ఆకివీడులో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర స్థాయి చెడుగుడు, రెండు జిల్లాల స్థాయి వాలీబాల్, మూడు నియోజకవర్గాల స్థాయి క్రికెట్ పోటీలు, జిల్లా స్థాయి చెస్, డాన్స్, పాటల పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు బీ.రాంబాబు, గోపిశెట్టి రాంబాబు, అర్జి సతీష్, వెంకటేష్, అజయ్, గణేష్, పెంకి అప్పారావు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం గత డిసెంబర్ 31న మండలంలోని ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన ముచ్చెర్ల బాలకృష్ణ కూలి పనులు ముగించుకుని రాత్రి 9 గంటలకు తన ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సెల్ ఫోన్ పడిపోయింది. వెనుక అదే గ్రామానికి చెందిన మల్లాడి మోహన్ కుమార్ తన ద్విచక్రవాహనాన్ని సెల్ ఫోన్‌పై ఎక్కించడంతో పగిలిపోయింది. దీంతో ముచ్చెర్ల బాలకృష్ణ తన సెల్‌ఫోన్‌పై బండి ఎందుకు ఎక్కించి పగలగొట్టావ్ అంటూ అడగగా మల్లాడి మోహన్ కుమార్ దుర్భాషలాడుతూ కర్రతో బాలకృష్ణను కాళ్లు, చేతులపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వరుసకు అన్నయ్య అయిన తోట సోమేశ్వరరావు భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి బాలకృష్ణను తీసుకువెళ్లి చికిత్స చేయిస్తున్నాడు. ముచ్చెర్ల బాలకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటర్ దాఖలు

ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన మల్లాడి మోహన్ రావు తనను పాత గొడవల నేపథ్యంలో ముచ్చెర్ల బాలకృష్ణ, ముచ్చెర్ల సత్యవర్ధన్, తోట సోమేశ్వరరావులు అన్యాయంగా కొట్టి గాయపరిచారని మల్లాడి మోహన్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కోళ్లపర్రులో కరెంట్ కట్

ఆకివీడు: కోళ్లపర్రు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. దీనివల్ల కోళ్లపర్రు, గుమ్ములూరు, అప్పారావుపేట, రాజులపేట, కొల్లేరు తీరంలోని చేపలు, రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా

పాలకొల్లు సెంట్రల్: బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సంద్భంగా భవాని మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించాలంటే ఆర్ కృష్ణయ్యకు కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఏబీసీడీలుగా విభజించి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అనంతరం సత్యనారాయణను సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడె యుగందర్, పొన్నమండ ముత్యాలరావు, వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరి వెంకటేశ్వరరావు, నీలంశెట్టి ప్రసాద్, మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎల్ఆర్ 3238 రకం వరి సాగుకు సన్నాహాలు

- మధ్యస్థ సన్నాలుగా గుర్తింపు
- తినడానికి అనువైన బియ్యం



కుప్పనపడిలో ఎన్ఎల్ఆర్ 3238 వంగడాలు వెదజల్లుతున్న చల్లారావు, పరిశీలిస్తున్న ఏఓ

ఆకివీడు: భుజించడానికి అనువైన బియ్యం లభించే మధ్యస్థ సన్నాలు వరి రకానికి చెందిన ఎన్ఎల్ఆర్ 3238 వంగడం సాగు చేయాలని మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక చెప్పారు. మండలంలోని కుప్పనపూడిలోని ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పొలంలో గురువారం ఎన్ఎల్ఆర్ 3238 వంగడాల్ని వెదజల్లు పద్ధతిలో సాగు చేయడాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ వంగడాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసేందుకు జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వర్లు 15 కేజీల చొప్పున విత్తనాలు అందజేశారని చెప్పారు. ఎకరంలో విత్తనాల్ని వెదజల్లు పద్ధతిలో సాగు చేసి,మరింత విస్తరింపజేసేందుకు అనువుగా ఉంటుందన్నారు. 120-125 రోజుల్లో పంట కోతకు వచ్చే ఈ వంగడం గాలులకు, వర్షాలకు పడిపోకుండా ఉంటుందన్నారు. 3238 రకం బియ్యంలో జింక్ అధికంగా ఉండి, ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుబడి ఉంటుందని ప్రియాంక వివరించారు. రైతు చల్లారావు మాట్లాతూ సాగుకు అనుకూలంగా తన భూమి ఉండటంతో 3238 నెల్లూరు రకం వంగడాన్ని సాగుకు తీసుకున్నట్లు చెప్పారు. దాళ్వా, ఖరీఫ్ సాగుకు అనువుగా ఈ వంగడం ఉంటుందన్నారు. బియాన్ని ఉడికిస్తే అన్నం పొడిగా ఉంటుందని చెబుతున్నారన్నారు. ప్రజలు నెల్లూరు రకం బియ్యం తినడానికి ఆసక్తి చూపుతున్నారని, దీని సాగును మరింత పెంచేందుకు ఖరీఫ్‌లో విత్తనాల్ని పలువురు రైతులకు అందజేస్తానన్నారు.

ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శన



ఉండి: మొదటిస్థానంలో నిలిచిన ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ విద్యార్థుల ప్రాజెక్టు



వీరవాసరం: విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులు



పాలకోడేరు: ప్రథమస్థానంలో నిలిచిన గొరగనమూడి హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

పాలకోడేరు: వేంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్లో మండలస్థాయి ఆకట్టుకున్న విజ్ఞానశాస్త్ర ప్రదర్శన గురువారం నిర్వహించారు. పాలకోడేరు మండలంలోని 10 ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 72 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అన్నింటినీ కేటగిరీ వారీగా విభజించి, మూడు ప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఫిజిక్స్‌లో విస్సాకోడేరు, వేంద్ర హైస్కూళ్లను, పర్యావరణంలో గొరగనమూడి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఎంపిక చేశారు. మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో విస్సాకోడేరు హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న మణికంఠ శ్రీ సాయి, టీచర్ సీహెచ్ అంజయ్య ప్రదర్శించిన యాంటీ సూసైడ్ ఫ్యాన్ విభాగానికి మొదటి స్థానం లభించింది. ఎవరైనా గదిలో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు అక్కడి ఫ్యాన్‌కు దానికి తాడు లేదా క్లాత్ కడితే అప్పటికే అక్కడ ఏర్పాటు చేసిన సెన్సార్ అలారం మోగడంతోపాటు ఆ బరువుకి ఫ్యాన్ కిందికి దిగిపోతుంది. ఈ విధానంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిని రక్షించవచ్చునని బయలాజికల్ టీచర్ సీహెచ్ అంజయ్య తెలిపారు

పర్యావరణంలో రివర్స్ క్లీనింగ్ బోట్ ఎంపిక

సమస్య జల కాలుష్యం. మానవుల స్వయం తప్పిదాల వల్ల, పరిశ్రమల వ్యర్థాల వల్ల, నదీ జలాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. రివర్స్ క్లీనింగ్ బోట్ నదుల్లోని తేలియాడే వ్యర్థాలన్నింటినీ తొలగిస్తుందని విద్యార్థి వంశీపవన్, గైడ్ టీచర్ గొరగనమూడి హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ వై హేమలత తెలిపారు. వీరిని హెచ్‌ఎం శ్రీనివాస్, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివరామరాజు, కడలి నాగేశ్వరి ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారి ఆలోచనలే భవిష్యత్తుకు బాటలు

ఉండి: చిన్నారి ఆలోచనలే బంగారు భవిష్యత్తుకు బాటలు అని ఎంఈవో జ్యోతి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండలస్థాయి గురువారం సైన్సు ఫెయిర్ నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని ఏడు జెడ్పీ, ఒక ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి 24 విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలను పరిశీలించిన జ్యూరీ కమిటీ వ్యక్తిగత విభాగంలో ఉండి జెడ్పీ హైస్కూల్, ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నార్పీ అగ్రహారం, ఫిజిక్స్ కేటగిరీలో మహదేవపట్నం స్కూళ్ల విద్యార్థులు ప్రథమస్థానాల్లో నిలిచారు. ఉండి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై రామలక్ష్మీ, ఎంఈవో2 వినాయకుడు, హైస్కూల్స్ హెచ్‌ఎంలు అక్బర్ చక్రవర్తి, జాన్‌బాబు, పీపీ దినకర్ పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయండి

వీరవాసరం: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ వీరవాసరం ఎమ్మార్కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 4న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈవీవీఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ గురువారం తెలిపారు. వీరవాసరంలో నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్ సన్నాహక సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో విజేతలందరూ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణకు వివిధ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పి.శ్యాం సుందర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ వి.ఎం. శ్యామ్ ప్రసాద్, ఎంఈఓలు పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ ఫెయిర్

వీరవాసరం: మండలంలోని కొణితివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బూట్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టమ్, విండ్ పవర్ సిస్టం, తెఫ్ట్ అలెర్ట్ సిస్టం, ఎకో ఫ్రెండ్లీ సిస్టం, కంట్రోల్ పొల్యూషన్ సిస్టం తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీమన్నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండా రామకృష్ణ ఉపాధ్యాయులు ఘట్కారి, చంద్ర ఉపాధ్యాయుల, విద్యార్థులు తిలకించారు.

ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్త కావాలి

ఆకివీడు: ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా తయారు కావాలని, సైన్సుతోనే అభివృద్ధి సాధ్యమని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం చెప్పారు. మండల స్థాయి సైన్సు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం గురువారం అయిభీమవరం జెడ్పీ స్కూల్లో జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని 9 జెడ్పీ స్కూళ్లు, 3 యూపీ స్కూళ్లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ఎంఈఓ ఏ.రవీంద్ర, ఎంఈఓ-2 సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరిగేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం చేస్తాయన్నారు. మండల సైన్సు కన్వీనర్ ముత్యాల వెంకటస్వామి మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందని, ఆ దిశగా ముందుకు వెళ్లేందుకే సైన్సు విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో వ్యక్తిగత ప్రదర్శనగా స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థి కె.మణికంఠ, ద్వితీయ జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.అమ్మని, తృతీయస్థానాన్ని సిద్ధాపురం హైస్కూల్ విద్యార్థి కైవశం చేసుకున్నారు. గ్రూపు విభాగంలో అయిభీమవరం జెడ్పీ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన ఎకో ఫ్రెండ్లీ టాయిలెట్ గీతిక, కె.సాయికృష్ణ విజయం సాధించి, జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. 12 స్కూళ్ల నుంచి మొత్తం 32 ప్రదర్శనలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

కాళ్ల: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కాళ్ల ఎంఈవో రవీంద్ర అన్నారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ సైన్సు వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సాంకేతిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఈ మేళాలో మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని రూపొందించిన సైన్స్ ప్రాజెక్టుల నమూన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉప సర్పంచ్ బూడి వెంకటపర్రాలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలకు ముస్తాబైన భీమవరం



భీమవరంలో సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు

భీమవరం: మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సీపీఎం 26వ జిల్లా మహాసభలకు భీమవరం పట్టణం ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నందున పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సీపీఎం జెండాలతో అలంకరించగా ప్రకాంచౌక్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి. సీపీఎం గ్రామస్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు నిర్వహించే మహాసభల్లో భాగంగా ఇప్పటికే గ్రామ, మండల మహాసభలు పూర్తికాగా జిల్లా మహాసభల నిర్వహణకు సన్నద్ధమయ్యారు. 3వ తేదీన ఉదయం పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి ప్రజాప్రదర్శనతో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. సాయంత్రం నుంచి ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ప్రతినిధుల సభ ప్రారంభమై 5వ తేదీ సాయంత్రం ముగుస్తుంది. ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, మంతెన సీతారామ్‌లు హాజరుకానున్నారు. భీమవరంలో సీపీఎం మహాసభలు సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. బహిరంగసభకు జిల్లాలోని 300 మంది ప్రతినిధులతో పాటు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీక్యాడర్, ప్రజలు హాజరవుతారని పార్టీ జిల్లా కార్యదర్శి బి బలరాం చెప్పారు.

సచివాలయ భవనం ప్రారంభం

పెనుమంట్ర: మండలంలో వెలగలవారిపాలెం గ్రామంలో రూ.43.50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెలగల సుగుణ అధ్యక్షతన నిర్వహించిన సభలో గ్రామంలో ప్రధాన సమస్యలను పెనుమంట్ర వాటర్ డీసీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి వివరించగా, పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పితాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మాండ్రు శాంత కుమారి, కర్రి బులిరామిరెడ్డి, మాజీ సర్పంచ్ జామి సత్యవతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.